క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు

నగరంపాలెం: పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, వారి పిల్లలకు సోమవారం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, ప్రస్తుత వాతావరణంలో పోలీసులకు సవాళ్లు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు శాంత కుమార్, బి.సీతారామయ్య (ఎస్బీ), ఆర్ఐలు హరిరెడ్డి, శివరామకృష్ణ పర్యవేక్షించారు.

జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్ జిల్లా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్-2024లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండో తరగతి విద్యార్థిని ఆర్.వల్లీ అవంతిక, అండర్-8 హూప్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

ఉద్యోగులు నిజాయతీగా పనిచేయాలి



లక్ష్మీపురం: అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్) చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.హెచ్.కోటేశ్వరరావు అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు వారం రోజులపాటు నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను కలెక్టరేట్ రోడ్డు లోని సీజీహెచ్ఎస్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.జి.హెచ్.ఎస్. డాక్టర్ డి.తుకారాం, ఫార్మాసిస్టులు ఆయేషా బేగం, సునీల్, మినిస్టీరియల్ ఉద్యోగులు రామారావు, మురళీకృష్ణ, మక్బూల్, రత్నరాజు, వెంకటేశ్వర్లు, నందమణి పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

లక్ష్మీపురం: తాడేపల్లి మండలం కృష్ణనగర్‌లోని ఎ.సి.సి. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం నాయకుడు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ 2015లోనే హైకోర్టు, లేబర్ కోర్టు కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని తీర్పుచెప్పినా, తీర్పును అమలు జరపలేదన్నారు. స్థానిక శాసన సభ్యులు లోకేష్ ఎన్నికలకు ముందు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, ఎస్.భావన్నారాయణ, ఎస్.ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనలో కేంద్రం విఫలం

లక్ష్మీపురం: యువతకు రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పి మూడో సారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ హామీలను నిలబెట్టుకోవడంలో దారుణంగా విఫలం అయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నగర నిర్మాణ మహాసభకు సోమవారం నిర్వహించారు. సమావేశానికి నగర అధ్యక్షుడు చిన్నపోతుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్.వలి మాట్లాడారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి వద్ద పార్క్ చేసిన బైక్ చోరీకి గురియైన ఘటన చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. రేపల్లె ప్రాంతానికి చెందిన ఆసిఫ్‌కుమార్, గుంటూరులోని గుండారావు పేటలో ఆరేళ్లుగా నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో సర్వీస్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 24వ తేదీన కంపెనీలో పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చి బైక్‌ని పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో వెతుకులాడగా ఎంతకు వాహనం కనిపించలేదు. సోమవారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పక్షవాతం.. అశ్రద్ధ చేస్తే అంతే..

నేడు వరల్డ్ స్ట్రోక్ డే

- ప్రాణాలకు ముప్పు
- 80 శాతం పక్షవాతాన్ని నివారించవచ్చు
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్ స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న పక్షవాత రోగులు(ఫైల్)


గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి కలవరపరుస్తోంది. వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా రోగాలు దాడి చేస్తున్నాయి. తట్టుకునే సామర్థ్యం కూడా తగ్గింది. వచ్చే వ్యాధుల్లో పక్షవాతం కూడా చేరిపోయింది. వ్యాధిని అవగాహన లేకపోవటం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మందులు ఉపయోగించకుండా, ఆకుపసర్లు మింగుతూ కాలయాపన చేయటం వల్లే శాశ్వతంగా వికలాంగులుగా ఉండాల్సి వస్తుందని ఒక అంచనా. అవగాహనతో నూటికి 80 శాతం నివారించవచ్చని చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పక్షవాతంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 29న ఏటా 'వరల్డ్ స్ట్రోక్ డే' నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వైద్యం

జిల్లాల్లో 30 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు మూడు నుంచి ఐదుగురు పక్షవాతానికి గురైన వారు చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 15 మంది వరకు పక్షవాతానికి గురైన వారు వైద్యం కోసం వస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఒక కోటి 70 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారు. వీరిలో 65లక్షల మంది చనిపోతున్నారు. మన దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు పెరాలసిస్ బారిన పడుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి....

కొన్ని సందర్భాల్లో ప్రాణాలు హరించి వేసే పక్షవాతం బారిన పడకుండా ఉండాలంటే ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్తపోటును, షుగర్‌ను అదుపులో పెట్టుకోవాలి. మద్యపానం, ధూమపానం చేయకూడదు. కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినకూడదు. స్థూలకాయం లేకుండా చూసుకోవటంతో పాటుగా ప్రతిరోజూ వ్యాయామం చేయటం మంచిది.



కారణాలు...

మెదడుకి వెళ్లే రక్తనాళం గాని, మెదడులోని రక్తనాళం గాని పూడుకుపోవటం వలన మెదడుకి రక్త సరఫరా ఆగిపోతే పక్షవాతం వస్తుంది. పక్షవాతం అంటే బ్రెయిన్ అటాక్. హార్ట్ అటాక్ లాగే ఇది చాలా ప్రమాదకరం. ఇది రావటానికి ప్రధాన కారణం రక్తపోటు(బీపీ) పెరగటం. పొగతాగటం, మద్యపానంతో రక్తనాళాలు దెబ్బతిని చిట్లిపోయి పక్షవాతం వస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం, మెదడులో కణుతులు, రక్తంలో కొవ్వు పదార్థాల వల్ల, మెదడువాపు వచ్చే వ్యాధుల వల్ల, గుండెజబ్బులవల్ల, స్థూలకాయుల్లోనూ, 70 ఏళ్లు దాటిన వారిలో వ్యాధి వస్తుంది.

లక్షణాలు...

పక్షవాతం వచ్చినవారికి ఒకే వస్తువు రెండుగా కనబడటం, మాట తడబడి, అయోమయంగా మాట్లాడటం, మింగుడు పడకపోవటం, నీరు సరిగా తాగలేకపోవటం, కళ్లు, తల తిరగటం, ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, నడకలో తూలుడు, మూతి ఒకవైపుకు వంకర పోవటం, దృష్టి మందగించటం, కాళ్లు చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి కోమాలోకి వెళ్తాడు.

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పక్షవాతం బాధితులకు కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. పది పడకలతో 2015 నుంచి పక్షవాత బాధితులకు వైద్యసేవలను అందిస్తున్నాం. రెండు తెలుగురాష్ట్రాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్ట్రోక్ యూనిట్‌ను కలిగి ఉన్న ఏకైక ఆస్పత్రి. స్ట్రోక్ బాధితులకు తక్షణమే చికిత్స అందించేలా క్యాజువాల్టిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి బాధితులు రాగానే తక్షణమే స్ట్రోక్ యూనిట్‌కు తరలించి చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ వైద్యవిభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

20శాతం కేసులకు ఆపరేషన్లు తప్పనిసరి



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో నూటికి 80శాతం మందికి మెడికల్ మేనేజ్‌మెంట్ ద్వారా పక్షవాతం తగ్గుతుంది. బ్రెయిన్‌లో రక్తపుగడ్డ పెద్దసైజులో ఉన్నప్పుడు 20 శాతం పక్షవాతం కేసులకు తప్పనిసరిగా ఆపరేషన్ చేస్తేనే రోగి బతికే అవకాశాలు ఉన్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడిని గోల్డెన్ అవర్‌లో న్యూరోసర్జన్ వైద్యుడి తీసుకెళ్తే సకాలంలో ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడతారు. ఆధునిక వైద్య సేవలు నేడు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, జీజీహెచ్, గుంటూరు

గోల్డెన్ అవర్‌లో తరలించాలి



1996లో అంకినీడు స్ట్రోక్ యూనిట్ స్థాపించాం. స్ట్రోక్ యూనిట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్నందుకు గాను నాలుగేళ్లుగా వరసగా అంతర్జాతీయ డైమాండ్ అవార్డు స్ట్రోక్ యూనిట్‌కు లభించింది. స్ట్రోక్ వచ్చిన రోగిని గోల్డెన్ అవర్‌లో సాధ్యమైనంత మేరకు గంట నుంచి 3 గంటల్లోపు స్ట్రోక్ యూనిట్‌కు తీసుకు రావడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

–డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

అవినీతి రహితంగా ఉద్యోగులు పనిచేయాలి

డీఆర్ఎం రామకృష్ణ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం

లక్ష్మీపురం: రైల్వే ఉద్యోగులు అవినీతి రహితంగా పనిచేయాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహించారు. తొలుత డివిజన్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్ఎం మాట్లాడుతూ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ దేశ శ్రేయస్సు కోసం, సమగ్రత, సంస్కృతి అనే విధానంతో ప్రారంభించడం చాలా సంతోషకరంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, సీనియర్ డీఓఎం షహబాజ్ హనూర్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమాలాకర్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల భాగంగా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు- 2 డీఈఈ ఎన్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ-8 సెక్షన్ పరిధిలోని కృష్ణనగర్, కుందుల రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సరఫరా ఉండదని చెప్పారు.

గుంటూరు డీ-4 సెక్షన్ పరిధిలో..

11కేవీ లైన్ నిర్వహణ కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తుఫాన్ నగర్, మారుతీ నగర్, నాయీబ్రాహ్మణ కాలనీ, తురకపాలెంరోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు డీ-4 సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.అంజినీరావు తెలిపారు.

యువజనోత్సవాల్లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపీచంద్, ఎస్ఆర్కే ప్రసాద్, నాగసుశీల



విద్యార్థులతో రామకృష్ణమూర్తి, మల్లికార్జున ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: యువజనోత్సవాల్లో జేకేసీ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్ తెలిపారు. ఏఎన్‌యూలో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల యువజనోత్సవాల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. జేకేసీ కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గోపీచంద్ మాట్లాడుతూ జానపద నృత్యంలో ప్రథమ బహుమతితో పాటు ఫోక్ ఆర్కెస్ట్రాలో తృతీయ బహుమతి, ఏకాంకిక, స్కిట్‌లలో ద్వితీయ, మెహందీ, క్విజ్ పోటీల్లో తృతీయ, మిమిక్రీ, మైమ్‌లలో కన్సొలేషన్, ఉత్తమ నటి విభాగంలో కాకర్ల మేఘన విజేతగా నిలిచినట్లు వివరించారు. కళాశాల నుంచి 32 మంది విద్యార్థులు ఆయా విభాగాల్లో పోటీ పడ్డారని, కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు పంచుమర్తి నాగ సుశీల టీం మేనేజర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. జేకేసీ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రాచ్యభాష విభాగ ఇన్‌చార్జ్ వై.ప్రశాంతి విద్యార్థులను అభినందించారు.

ఓవరాల్ చాంపియన్ హిందూ కళాశాల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహించిన యువజనోత్సవాల్లో హిందూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో సోమవారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు ఎనిమిది అంశాల్లో అంశాల్లో ప్రథమ బహుమతి, నాలుగింటిలో ద్వితీయ, మరో నాలుగు అంశాల్లో తృతీయ బహుమతులు పొందిన ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ హిందూ కళాశాల లలిత కళలకు పెట్టింది పేరని, ఆ సంప్రదాయాల్ని ఈ తరం విద్యార్థులు కొనసాగిస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. యువజనోత్సవాలతో విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ లలిత కళలతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లలిత కళా సమితి కన్వీనర్ డాక్టర్ ఎ.బాలశౌరి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కాళిదాస్, ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ రాము, సైన్సు కోర్సుల ఇన్‌చార్జ్ కె.శ్రీకాంత్, కామర్స్ విభాగాధిపతి శాంతిలత, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, నాగరాజు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మొరాయిస్తున్న ఏటీఎంలు



అరండల్‌పేట 18వ లైన్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం నాట్ వర్క్ బోర్డుతో దర్శనమిస్తున్న దృశ్యం

కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకులు వినియోగదారులను ఉప్పుతిప్పలు పెడుతున్నాయి. ఖాతాదారుల లావాదేవీలు ఏటీఎంల ద్వారా చేస్తున్నారు. దీంతో రద్దీ ఎక్కువైంది. అయితే ఏటీఎం సేవలందించడంలో విఫలమవుతున్నాయి. శని, ఆదివారాల్లో చాలాచోట్ల ఏటీఎంలు నో క్యాష్, నాట్ వర్కింగ్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. ఖాతాదారులు ఎక్కడ ఏటీఎం ఉన్నయంటూ వెతుకులాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిర్ణీత మొత్తాన్ని డిపాజిట్ చేసేందుకు కూడా ఏటీఎం మిషన్ పనిచేస్తుండడంతో వినియోగదారులకు బ్యాంకు లావాదేవీలు సులువ అయ్యాయి. దీనికి తోడు బ్యాంకు సెలవు దినాల్లో కూడా పనిచేస్తుండడం కొంత ఊరట. టెంపరరీ అవుట్ ఆఫ్ సర్వీస్ అని చూపిస్తున్నాయి. దీనికితోడు కొన్ని ఆన్‌లైన్ యాప్‌లు ఆ రోజుల్లో సర్వర్ బిజీ అని వస్తుండటంతో ప్రజలు విసిగిపోతున్నారు. గుంటూరు జిల్లాలో వివిధ బ్యాంకులకు సంబంధించి సుమారు 512 శాఖలున్నాయి. వీటికి అనుబంధంగా సుమారు 701 వరకు ఏటీఎంలు ఉన్నాయి.

యాప్‌లూ అంతే..

ప్రస్తుతం చిన్న మొత్తాల్లో లావాదేవీలకు అనేక మంది స్మార్ట్‌ఫోన్లలో గూగుల్ పే, ఫోన్ పే, క్రెడిట్ తదితర యాప్స్‌పై ఆధారపడ్డారు. బ్యాంకులు కూడా యాప్‌ల ద్వారా సేవలందిస్తున్నాయి. అయితే ఇవి కూడా శని, ఆదివారాల్లో సక్రమంగా పనిచేయడం లేదు. మీ బ్యాంక్ సర్వర్ ప్రస్తుతం బిజీగా ఉందనే మెసేజ్ దర్శనమిస్తోంది.

పరిశీలిస్తాం..

ఏటీఎంలలో నగదు తప్పకుండా ఉండాలి. లేని పక్షంలో ఆర్బీఐ నిబంధనల మేరకు ఆయా బ్యాంక్‌లకు ఫెనాల్టీ పడుతుంది. అన్నింటినీ పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. స్మార్ట్ ఫోన్లలో నగదు లావాదేవీలకు సంబంధించి వాడే యాప్‌లకు ప్రత్యేక సర్వర్ ఉంటుంది.

–మహిపాల్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్, గుంటూరు జిల్లా

మా ఇళ్లను తొలగించవద్దు..

నగర కమిషనర్‌కు విన్నవించిన 49వ డివిజన్ వాసులు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: మేమంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేదవారం. గత 40 ఏళ్లకు పైబడి 49వ డివిజన్ పరిధిలోని శారదాకాలనీ 1వ లైన్ మార్జిన్‌లో రెవెన్యూ పొరంబోకు స్థలంలో నివాసం ఉంటున్నాం. మమ్మల్ని ఆకస్మాత్తుగా నగరపాలక సంస్థ అధికారులు వచ్చి మీ ఇళ్లను కూల్చేస్తామని మార్కింగ్ ఇచ్చి వెళ్లడంపై స్థానిక వాసులు భయాందోళన చెందారు. పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లతో కలసి సోమవారం కమిషనర్ పులి శ్రీనివాసులు ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు.

ప్రత్యామ్నాయం చూపించి తొలగించాలని వినతి..

మేము 40 ఏళ్లుగా నివాసముంటున్న ఎప్పుడు ఇటువంటి సమస్య రాలేదు. కాని ఇప్పుడు నగరపాలక సంస్థ అధికారులు ఇళ్లు తొలగించాల్సిందేనని హెచ్చరిస్తున్నారు. అంతగా డ్రెయిన్ పెద్దది చేయాలనుకుంటే చేసుకోండి.. కాని మాకు ప్రత్యామ్నాయంగా వేరే చోట నివాసాలు ఏర్పాటు చూపించి మా ఇళ్లను తొలగించాలని విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తరువాతే మీకు ఇళ్లను తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు బోడపాటి ఉషారాణి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కాంత్రకుంట గురవయ్య, బూసి రాజలత, మారుతి లింగారెడ్డి, ఏరువ సాంబిరెడ్డి, అడక పద్మావతి తెలిపారు.

జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

-మంత్రులు కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: జనసేన పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం లాడ్జి సెంటర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

తెలుగు క్రీడాకారులను ప్రోత్సహించాలి

పవర్ లిఫ్టర్‌ను అభినందిస్తున్న తులసి ధర్మచరణ్



జ్ఞాన దివ్యను అభినందిస్తున్న ధర్మచరణ్

కొరిటెపాడు: అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే తెలుగు క్రీడాకారులు, అథ్లెట్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహాలు అందజేసి వారి ప్రతిభకు అండగా నిలవాలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ కోరారు. తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో నిర్వహించిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరఫున నాలుగు కాంస్య పతకాలు సాధించటంపై ధర్మచరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యను ధర్మచరణ్ అభినందించి, సత్కరించారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ తెలుగు మహిళా క్రీడాకారులు చాలా అరుదుగా క్రీడల్లో రాణిస్తున్నారని, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య లాంటి వారికి మరింత ప్రోత్సాహాలు అందజేస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో అంతర్జాతీయ స్థాయిలో నాలుగు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించడం మన బాధ్యత అని తెలిపారు. పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యకు గతంలో పలు సార్లు ఆర్థిక తోడ్పాటును అందజేశానని, భవిష్యత్ లో కూడా తాను పాల్గొనబోయే చాంపియన్‌షిప్‌లకు ఆర్థికపరంగా అండగా ఉంటానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్ఞాన దివ్య కుటుంబ సభ్యులు, కోచ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం విధుల్లో నిర్లక్ష్యం తగదు

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నగరంలో 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పండరీపురం, అశోక్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, పనులపై అసహనం వ్యక్తం చేసి, స్థానిక శానిటేషన్ కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అరండల్ పేట మెయిన్ రోడ్‌లో శంకర్ విలాస్ ఆర్‌ఓబీ మార్కింగ్‌ని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత పండరీపురం 2,3 లైన్లు పరిశీలించి, రోడ్ల మీద గార్బేజ్ కుప్పలు ఉండడం, డ్రైయిన్లలో మురుగుపారుదల లేకుండా ఉండడం గమనించి, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న స్థానిక శానిటేషన్ కార్యదర్శి ఎం.రాజకుమారిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. అనంతరం శంకర్ విలాస్ ఆర్‌ఓబీ మార్కింగ్‌ని అరండల్‌పేట మెయిన్ రోడ్‌లో పరిశీలించి, మార్కింగ్ వేగవంతం చేసి నివేదిక ఇవ్వాలని ఏసీపీని కోరారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణ రావు, ఏసీపీ రెహ్మాన్, ఎంహెచ్ఓ ఆనందకుమార్, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్ పాల్గొన్నారు.

అర్జీలను వారం రోజుల్లో..

నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ చేపట్టే డయల్ యువర్ కమిషనర్, ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఇస్తున్న అర్జీలను వచ్చే వారానికి పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి 25 ఫిర్యాదులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా..

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు సిహెచ్.లోకరాజు, జె.దేవరాజు, ఎ.ముత్తు కుమార్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌లను సోమవారం అందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com